# ఓం సాయిరాం

## ఆధ్యాత్మిక మాసపత్రిక



ప్రారంభసంచిక
ఫిబ్రవరి' 96
వెల: రూ. 4

# "సర్వం సాయిమయం"

"సర్వం సాయిమయం"..... సాయి సర్వాంతర్యామి..... సాయి ఎవరో కాదు. ఆ పరమాత్మ స్వరూపం. సాక్షాత్ ఈశ్వరశక్తి మిళితుడు. సాయి అర్థమే ఈశ్వరుడు. అని అర్థం పరమాత్మ అని అర్థం, అంటే సాయే ఈశ్వరుడు ఈశ్వరుడే సాయి. సర్వాంతర్యామి సాయి స్వరూపం. కులమతాలకతీతుడు. అల్లామాలిక్ అంటూ ముస్లిం దేవుని నామం స్మరించే 'సాయి' ముస్లిం అనుకునేదా, గణనాధుని, మారుతి, రాముడు, కృష్ణుడు, విఠలుడు, రూపాలతో దర్శనమిస్తూ ఆయా నామాలు జపిస్తున్నందులకు హిందూమతస్తుడు అనుకునేదా, ఏమతస్తుడనుకోవాలి, ఏ కులస్తుడనుకోవాలి, అన్ని జాతులవారిని, మతాలవారిని, కులాలవారిని చేరదీస్తూ అన్ని జాతుల భక్తుల సంఖ్యను అధికంగా సంపాదించి వారిచే పూజలు, భజనలు, హారతులు అందుకుంటున్న అందులోని ఏ కులం సాయిది, ఏమతం సాయిది, ఏ జాతి సాయిది అనుకోవాలి. ధరించేది ముస్లిం బట్టలు టోపి, ఆచరించేది హిందూ సంప్రదాయం, పూజలు - భజనలు అన్ని రీతులుగా. ఈ విధంగా అగుపించే 'సాయిది' ఏదని నిర్ణయించగలం కులమతజాతి!

అంటే దీనిని బట్టి తెలిసేదేమిటంటే, సాయిరాంది, సమతాకులం, మమతాకులం, సర్వమతాల సమ్మేళనం, సర్వభక్తుల సమూహం, సర్వం, సర్వాంతర్యామి ఏ ఒక్కదానికే కట్టుబడి ఉండని దైవం మనందరికీ గురువు. మానవులందరినీ సమస్త జీవరాశిని యావత్ మంది భక్తులను సర్వసమానంగా చూసుకుంటున్న దయామయశీలి, కరుణామయ రూపం, అతి త్వరగా కటాక్షించే ప్రేమశీలి. అటువంటి సాయినామం పవిత్రం, సాయి రూపం దివ్యం, సాయి పలుకు అమృతం, సాయి సందేశం హెచ్చరిక, సాయి భక్తుల పాలిట కల్పవృక్షం వంటివారు! ఆదిగురువు, జగద్గురువు, సాయే! అట్టి సాయినాధుని సేవలు భజనలు కీర్తనలు, ప్రార్థనలు, పూజలు, చేసిన ఏ భక్తుడికైనా ముక్తి, మోక్షం సిరి, సంపద, సుఖసౌకర్యాలు కలుగక మానవు. బాబా ఎప్పుడు అంటారు "నాభక్తుల గృహములయందు "లేమి' యను శబ్దము పొడచూపదు" అని! బాబాని కొలిచిన కలుగును ఎనలేని సిరులు!

గురుదైవాల మిళితమే బాబా! బాబా అంటే తండ్రి, ఆ తండ్రి మనని కన్నబిడ్డల్లా చూసుకోవటమే కాక, "నా యందెవరికి దృష్టికలదో వారియందూ నా కటాక్షమూ తప్పక ఉండును" అని అంటారు. కాబట్టి ఇక్కడ మనం నిలపాల్సింది మనస్సు! అన్నింటికీ మూలం మనసు! శారీరకంగా పనులు నిర్వహిస్తున్నా 'మనసు' మాత్రం పరమాత్మ కర్పించినప్పుడే పుణ్యం మోక్షం భగవత్ కటాక్షం మనకు లభించేది అంటూ బాబా చెప్పిన హితబోధనలతో సందేశాలు చెపుతున్నాయి. అసలు బాబా అంటే ఎవరు? త్యాగమయి భిక్ష రూపంలో వారి వారి పాపాలను

*"ఆత్మసుఖాన్ని పొందాలంటే విషయసుఖాలకు దూరంగా ఉండాలి"*

గైకొని మోక్షమిచ్చే సాక్షాత్ ఈశ్వరుడు, భక్తుల నుంచి పాపాలను భిక్షరూపంలో గైకొనుచూ, దీవెనలు, ముక్తి మోక్షం ప్రసాదిస్తూ, ఆ పుచ్చుకున్న పాపాలను ప్రక్షాళన గావించుకుంటూ సిద్ధుడులా అగుపించే ప్రత్యక్ష దైవం సాయి, "మీ భారములను నాపైబడవేయడు, నేను మోసెదను" అంటూ భక్తుల భారాలను మోసే కరుణామయుడు.

ఓ అప్పుడిలా, స్నేహితుడిలా, తల్లిలా, తండ్రిలా, గురువుగా, దైవంగా, భక్తులను చేరదీస్తూ ఆదరిస్తూ "నా సహాయమును గానీ, సలహాను గానీ, కోరిన తక్షణమే నేను యొసెంగెదను" అంటూ హామీ యిచ్చేవాడు సాక్షాత్ ప్రత్యక్షదైవంగా నిలిచిన సాయిదేవుడు.

పాపపుణ్యాలు ఖర్మయోగాలు, సుఖశాంతులు ధనకనక వస్తు రూపాలు మనకొసంగే పుణ్యభూమిని మనకందించిన సాయినాథుని నివాసమే షిర్డీ. అందుకే అంటారు సాయి "షిర్డీ ప్రవేశమే మీకందరికీ సర్వదుఃఖ పరిహారము" అంటూ, కులమతాలకు బీద గొప్ప తేడాలకు అతీతంగా దూరంగా, నిలిచిన వారే సాయి రాముడికి దగ్గర కాగలరని బాబా యిచ్చిన సందేశం చెప్తోంది. అందుకే అనక తప్పదు "సర్వం సాయిమయం" అని!!

శ్రీమతి జి. రామలక్ష్మి
హైదరాబాద్ -44

## "పదమాల"

'ఓం సాయిరాం' పాఠకులకు నచ్చేవిధంగా, వారిలో ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పెంచే విధంగా వచ్చే సంచిక నుంచి ప్రముఖ కవి, రచయిత శ్రీ యామినీ సరస్వతి గారి నిర్వహణలో 'పదమాల' పేరుతో పజిల్ పేజీని ప్రారంభిస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

## 'సాయి సేవలో......'

ఎందరో భక్తులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు బాబావారి సేవగా అన్నదానాలు, భజనలు వంటి దివ్య కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అటువంటి కార్యక్రమాల వివరాలను మాకు తెలియజేస్తే "సాయిసేవలో...." శీర్షిక కింద ప్రచురించగలమని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

\- ఎడిటర్

"ఆత్మవంచనతో పెరిగిన స్వాతిశయం వలన పతనం తప్పదు"